## క్లుప్తంగా

### నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

దక్కిలి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు చాగణం ట్రస్టు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్ల ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు.

### బాలసదన్‌లో వసతుల పరిశీలన


బాలసదన్‌లో అధికారులు

కోట: స్థానిక బాలసదన్‌ను శనివారం డీపీఓ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో అధికారుల బృందం పరిశీలించింది. ఇక్కడ వంద మంది వరకు బాలికలకు ఆశ్రయం కల్పిస్తున్నారు. విద్యార్థుల వసతి గదులు, మెనూ, విద్యాభ్యాసం తదితర వివరాలతోపాటు రికార్డులను అధికారులు పరిశీలించారు. తనిఖీలు జరిపి వసతులను పరిశీలించినట్లు డీపీఓ తెలిపారు. తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ భవానీ, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యులు సుమలత, రాజ్యలక్ష్మి, బాలసదన్ సూపరింటెండెంట్ దుర్గాదేవి పాల్గొన్నారు.

### నిరుపేదల అభ్యున్నతే లక్ష్యం


మాట్లాడుతున్న ఏపీఎం

సైదాపురం: నిరుపేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఏపీఎం రాధారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గొర్రెలు, మేకల పెంపకందారుల పరస్పర సహాయ సహకార సంఘం ఆరో వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ప్రతిపాదించామన్నారు. సంఘం అభివృద్ధి అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు.

### నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గ సభ్యులు

గూడూరురూరల్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ గూడూరు డివిజన్ నూతన కార్యవర్గాన్ని శనివారం పట్టణంలోని ప్రైవేట్ భవనంలో ఎంపిక చేశారు. ముందుగా రీజినల్ అధ్యక్షుడు ఎస్ లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎలక్ట్రిసిటీలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నిక నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడిగా షేక్ కరిముల్లా, కార్యదర్శి ఎంపీ వెంకటేశ్వర్లు, కోశాధికారి వైకే దయాసాగర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా డీ శ్యాంసుందర్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో రీజినల్ కార్యదర్శి టీ శ్రీనివాసులు, రీజినల్ మాజీ అధ్యక్షుడు సీ శ్రీనివాసులు, అదనపు ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య, రీజినల్ కోశాధికారి మురళి, సందానీ బాషా, తదితరులు పాల్గొన్నారు.

### సృజనాత్మకత పెంచుకోవాలి

రాపూరు: విద్యార్థులు చదువుతోపాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి గ్రంథాలయాధికారి ధనమ్మ సూచించారు. రాపూరు గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. టీచర్ ఈశ్వర్, లైబ్రరీ సహాయకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### ఘనంగా నరసింహుడి కల్యాణం


ఊంజల్ సేవ చేస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ జరిపారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నిత్యకల్యాణ మండపంలో కొలువు దీర్చి, విశేషాలంకరణ చేసి, మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్‌సేవ చేశారు.

### హుండీ ఆదాయం రూ.2.52 లక్షలు


హుండీ లెక్కిస్తున్న విద్యార్థులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని పోలేరమ్మ ఆలయానికి హుండీల ద్వారా రూ.2.52 లక్షలు ఆదాయం వచ్చిందని దేవదాయశాఖ గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు తెలిపారు. శనివారం సీవీ రామన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పోలేరమ్మ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు చేపట్టారు. మొత్తం రూ 2,52,454 ఆదాయం వచ్చినట్లు శ్రీనివాసబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ శాంతరావు, కోట ఈఓ శశాంక్, ఆలయ కమిటీ చైర్మన్ సిద్దయ్య, సీవీ రామన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గోపి, కమిటీ సభ్యులు చెంచు కిషోర్‌శెట్టి, ఎస్ రామారావు పాల్గొన్నారు.

# సంక్షేమం..అభివృద్ధే జగనన్న ధ్యేయం


ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సువర్ణ పరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఏడో వార్డు ఎన్టీఆర్ కాలనీలో శనివారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు మేనిఫెస్టోలో హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రంలో సచివాలయం వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే పరిపాలన అందించి, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం అందుబాటులోకి తెచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో వెంకటగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, కౌన్సిలర్ కె చంద్రశేఖర్, విప్ పీ లక్ష్మి, కౌన్సిలర్లు కే కళ్యాణి, పి ప్రభావతి, వహిద, నేతలు మల్లిరెడ్డి, సీహెచ్ మురళి, ఆర్ చిన్నా, గణేష్‌రెడ్డి, పేజీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### మస్తాన్ కుటుంబ సభ్యులకు నేదురుమల్లి పరామర్శ


మస్తాన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నేదురుమల్లి

మాజీ సర్పంచ్ తుమ్మూరు పెద్ద మస్తాన్‌రెడ్డి కుటుంబ సభ్యులను నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి పరామర్శించారు. అమ్మపాళెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తుమ్మూరు పెద్ద మస్తాన్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న నేదురుమల్లి శనివారం ఆ గ్రామానికి వెళ్లి, మృతుడు మస్తాన్ రెడ్డి భార్య పోలమ్మ, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ కే శ్రీనివాసులరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఎం వెంకటేశ్వర్లు, నేతలు సదారెడ్డి, రామకృష్ణయ్య, సుబ్బరామయ్య, నరసింహులు, ధనంజయ్య, ఈశ్వరయ్య, రమణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# సీఎం సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ బల్లికల్యాణ్‌చక్రవర్తి

గూడూరురూరల్: పులికాట్ సరస్సు ముఖద్వారాల్లో పూడిక తీత పనుల శంకుస్థాపనకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి విచ్చేస్తున్న సందర్భంగా ఏర్పాటు చేయనున్న సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి పిలుపునిచ్చారు. గూడూరులో ఎమ్మెల్యే నివాసంలో శనివారం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలోని పులికాట్ సరస్సులో సుమారు రూ.129 కోట్ల నిధులతో చేపట్టనున్న పూడిక తీత పనులు చేపట్టడంతో వాకాడు మండలం పూడిరాయిదొరువు,(నవాబుపేట), కొండూరుపాళెం ప్రాంతాల్లో మత్స్య సంపద పెరిగేందుకు దోహదపడుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి సీఎం సభకు తరలి వచ్చేలా చూడాలని చెప్పారు. ఇందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో తాను ఎంపీగా ఉన్న సమయంలో పులికాట్ అభివృద్ధి చేయాలని అప్పటి ప్రభుత్వం టీడీపీకి వినతులు అందించినా చంద్రబాబు తన లేఖను కనీసం చూడను కూడా చూడలేదన్నారు. పులికాట్‌తోపాటు సముద్ర ముఖద్వారాలు ఉండే వాకాడు తదితర ప్రాంతాల అభివృద్ధి విషయాన్ని తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం కేంద్ర ప్రభుత్వంతో చర్చించి, నిధులు మంజూరు చేయించారన్నారు. ఎమ్మెల్సీ కళ్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ తన తండ్రి బల్లి దుర్గాప్రసాద్‌రావు ఎమ్మెల్యేగా, తిరుపతి ఎంపీగా ఉన్న సమయంలో మత్స్యకారుల జీవన ప్రమాణాలను పెంచేలా సముద్ర ముఖ ద్వారాల్లో పూడిక తీత పనులు చేయాలని కోరారని, ఆయన అనంతరం తన వంతు కూడా సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లగా నేడు నిధులు మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు. వాకాడు మండలంలో కూడా సముద్ర ముఖ ద్వారాల పూడిక తీత పనులు జరిగితే మత్స్య సంపదకు కరువు లేకుండా ఉంటుందని అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బీ విజయకుమార్, కే మీరారెడ్డి, బీ శ్రీనివాసులు, కే సునీల్‌రెడ్డి, అజీజ్‌ఖాన్, వీ రమణయ్య, జెడ్పీటీసీ సభ్యులు యామని, శీనయ్య, ఎంపీపీ గురవయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# మరింత చేరువగా ఆర్టీసీ కార్గో సేవలు


వెంకటగిరి రూరల్: ఆర్టీసీ బస్టాండ్‌లో ర్యాలీ చేస్తున్న ఆర్టీసీ అధికారులు


గూడూరులో..

వెంకటగిరిరూరల్: ప్రజలకు మరింత చేరువగా ఆర్టీసీ కార్గోసేవలను అందించనున్నట్లు వెంకటగిరి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ కేవీ శివాజీ పేర్కొన్నారు. కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తక్కువ సమయం, తక్కువ చార్జీలతో ఆర్టీసీ కార్గో డోర్‌డెలివరీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రవాణా సాగించే ప్రయాణికులు ఆర్టీసీ కార్గోసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**10 కిలోమీటర్ల వరకు ఉచిత డోర్ డెలవరీ**

గూడూరురూరల్: ఆర్టీసీలోని కార్గో సేవలను వినియోగించుకుంటే 10 కిలోమీటర్ల వరకు ఉచితంగా డోర్‌డెలివరీ చేస్తామని ఆర్టీసీ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలో శనివారం కార్గో సేవలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో ఏడాది క్రితం కార్గో సేవలను ప్రారంభించామన్నారు. ఈ సేవలు సులభతరం చేయడానికి 10 కిలోమీటర్ల దూరం ఉన్న చిరునామాలకు కూడా డోర్ డెలివరీ ఉచితంగా చేసేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్లు సుబ్రహ్మణ్యంరాజు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

### ఆదర్శంగా తీసుకోవాలి

గూడూరురూరల్: ఝాన్సీ లక్ష్మీభాయిని మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోట సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీభాయి జయంతిని సందర్భంగా సెమినార్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ సహ కార్యదర్శి సుమన్‌విన్నా, నగర కార్యదర్శి వినయ్, మహిళా నాయకురాలు, శ్రావణి, కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు అధ్యాపకురాలు మైథిలి, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఇంటి నంబర్లు తప్పనిసరి


బీఎల్వోలతో సమీక్షిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

చిల్లకూరు: ఓటర్ల జాబితాలో ఇంటి నంబర్లు తప్పనిసరిగా వేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం మండలంలోని బీఎల్వోలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్లను నమోదు పూర్తి చేశామని, అయితే కొంత మంది దరఖాస్తులో ఇంటి నంబర్లు లేకుండా పూర్తి చేయడంతో ఆ దరఖాస్తులను తిరిగి పంపించే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయికి వెళ్లి ఇంటి నంబర్‌రు కచ్చితంగా ఉంచేలా చూడాలని అన్నారు.

# విద్యతో ఉజ్వల భవిత


సమావేశంలో మాట్లాడుతున్న దొంతు శారద

సైదాపురం(వెంకటగిరి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్ చేకూరుతుందని నెల్లూరు జిల్లా గ్రంథాలయసంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గ్రంథాలయంలో శనివారం చదువు అంటే మాకు ఇష్టం నినాదంలో కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత చదువుల తల్లి సరస్వతీదేవికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దొంతు శారద మాట్లాడుతూ పేదరికం విద్యకు అడ్డురాకూడదనే దిశగా ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్య వంటి పథకాలు అమలు చేసిన విద్యార్థులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను రూపురేఖలు మార్చి కార్పొరేట్ ధీటుగా నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విప్ పూజారి లక్ష్మి, గ్రంథాలయాధికారి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యం


కిట్లు అందజేస్తున్న నాయకులు

సైదాపురం: సంక్షేమ పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎం రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని కొమ్మిపాడు సర్పంచ్ శ్రవంతి అధ్యక్షతన శనివారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాల పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యవర్గ సభ్యులు వి ప్రభాకర్‌రెడ్డి, జే సీఎస్ మండల కన్వీనర్ జీ శ్రీనివాసులురాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్, నేతలు రామ్‌గోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, గోపాలయ్య, హరి, సుబ్బరాజు, మధు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### వెంకన్నకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

దొరవారిసత్రం: వేలికాడు ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం విగ్రహం ప్రతిష్టించి, ప్రత్యేక పూజలు చేశారు. వేద మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి పూజలు చేసి ఆలయ గోపురంపై కలశాన్ని ప్రతిష్టించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# వైభవంగా తారకాసుర సంహారం


తారకాసురుడి ఊరేగింపు


పురవీధుల్లో ఊరేగుతున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

నాయుడుపేటటౌన్: పట్టణంలోని శ్రీవల్లి, దేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి స్కంద షష్టి వేడుకల్లో వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక గడియారం సెంటర్‌లో తారకాసుర సంహారం వద్ద ఘనంగా నిర్వహించారు. ముందుగా తారకాసురుని సంహరించేందుకు వినియోగించే వేళాయుధాని(శూలం)కి పలు ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం కావడి ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సీ మోహన్‌కృష్ణ శర్మ, గణేష్‌శర్మ పాల్గొన్నారు.

# వాహనాల సీజ్



సైదాపురం: మండలంలోని తిప్పిరెడ్డిపల్లెలో శనివారం రాపూరు సీఐ సుబ్రమణ్యం నేతృత్వంలో ఎస్‌ఐ మాల్యాద్రి, వాసు అక్రమ మైనింగ్‌పై దాడులు చేశారు. ఈ సందర్భంగా నాలుగు ప్రొక్లెయినర్లు, రెండు జేసీబీలు, ఒక ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

# భక్తి శ్రద్ధలతో విగ్రహాలకు ప్రాణప్రతిష్ట


హోమాలు చేస్తున్న వేదపండితులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో నూతనంగా నిర్మించిన కల్యాణ వేంకటేశ్వర స్వామితోపాటు అమ్మవారి విగ్రహాలకు శనివారం ప్రాణప్రతిష్ట చేశారు. దీంతో కుంభాభిషేక వేడుకలు ముగిశాయి. ఆలయం వద్ద వేదపండితులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఆలయంలో వూహ్యలక్ష్మి సమేత కల్యాణవేంకటేశ్వరస్వామితోపాటు గరుడాళ్వార్ విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు.

### పేరెంట్స్ కమిటీ పర్యవేక్షణలో విద్యా ప్రణాళిక

కలువాయి: పేరెంట్స్ కమిటీ(పీసీ) పర్యవేక్షణలో విద్యాప్రణాళిక రూపొందించాలని ఎంఈఓలు బాలకృష్ణారెడ్డి, శేషగిరిరావు సూచించారు. శనివారం ఎమ్మార్సీలో పాఠశాల విద్యా ప్రణాళిక, ఆవాస ప్రాంత విద్యా ప్రణాళికపై ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024–25, 2025–26 విద్యా సంవత్సరాలకు గాను పాఠశాలలకు అవసరమైన నిధులు, కావాల్సిన ఉపాధ్యాయులు, పాఠశాలకు వసతులు, మౌలిక సదుపాయాలు, నిధుల వినియోగం తదితర అంశాలపై ప్రణాళికలు తయారు చేయాలన్నారు. రిసోర్సు పర్సన్ వీ కృష్ణారెడ్డి, సీఆర్‌ఎంటీ నాగేశ్వరరావు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ యానాదయ్య పాల్గొన్నారు.

### వరల్డ్‌కప్ మ్యాచ్ వీక్షణకు బిగ్ స్క్రీన్

సైదాపురం(వెంకటగిరి): క్రికెట్ వరల్డ్‌కప్ 2023 భారత్– ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్ సందర్భంగా పట్టణంలోని విశ్వోదయ కళాశాల ప్రాంగణంలో బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి క్రికెట్ అభిమానుల కోసం లైవ్ ఆన్ బిగ్‌స్క్రీన్ ఏర్పాటు చేయనున్నట్లు నేదురుమల్లి కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. క్రికెట్ అభిమానులు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరాయి.

**బీచ్ వద్ద పూజలు**


పూజలు చేస్తున్న క్రీడాకారులు

వాకాడు: భారత్ – ఆస్ట్రేలియా మధ్య ఆదివారం జరగనున్న ప్రపంచ క్రికెట్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించాలని శనివారం వాకాడు మండలం తూపిలిపాళెం మత్స్యకార క్రికెట్ ప్లేయర్లు బీచ్ వద్ద పూజలు చేశారు. మత్స్యకార క్రికెట్ క్రీడాకారులు ఏ జైపాల్, విజయ్, బ్రహ్మయ్య ఆధ్వర్యంలో సముద్రం వద్ద వారి ఆరాధ్య దైవానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వి వెంకటరమణయ్య, వెంకటేశ్వర్లు, సోమయ్య, గణేష్, నాగ, ఏడుకొండలు, కమలహాసన్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణమందిరం భూముల పరిశీలన


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఓజిలి: మండలంలోని ముమ్మాయపాళెంలో సర్వే 305–5.92లో శ్రీకృష్ణమందిరానికి సంబంధించిన భూములను తహసీల్దార్ శివరామసుబ్బయ్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొంత మంది శ్రీకృష్ణమందిరం భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారన్నారు. గ్రామానికి చెందిన మరో వర్గం శ్రీకృష్ణ మందిరం భూములను కాపాడాలని వినతిపత్రం అందించారని తెలిపారు. గ్రామస్తులు నుంచి వివరాలు సేకరించామని, పట్టాభూములు కావడంతో ఆన్‌లైన్‌లో శ్రీకృష్ణమందిరం పేరుతో ఉన్నందున ఏమి మార్పులు చేసేదిలేదని స్పష్టం చేశారు. అనంతరం కృష్ణమందిరం భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని తహసీల్దార్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట వీఆర్వో తిరుపాలయ్య, వైఎస్సార్‌సీపీ నేత చిన్నపెంచలయ్య, మాజీ సర్పంచ్ ఎం భక్తవత్సలరావు ఉన్నారు.

### గాయపడిన వ్యక్తి మృతి

తడ: రోడ్డు ప్రమాదంలో గాయపడి నెల్లూరులో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి కథనం మేరకు.. వెంకటగిరికి చెందిన ఎం హేమకుమార్(30) మేనకూరు సెజ్‌లోని ఓ పరిశ్రమలో పనిచేస్తూ అక్కడే ఓ గదిలో నివశిస్తున్నాడు. గత శుక్రవారం బైక్‌పై సూళ్లూరుపేటకు వెళ్లి తిరిగి వస్తూ తను పనిచేసే పరిశ్రమకు సమీపంలో రోడ్డుపై పడిపోవడంతో గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పరిశ్రమ యాజమాన్యం అతన్ని నెల్లూరుకు తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అతను మరణించాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఉపాధి పనులకు రూ.11.64 కోట్ల ఖర్చు

దక్కిలి (బాలాయపల్లె): మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ కింద 704 పనులకు రూ.11.64 కోట్లు ఖర్చు చేసినట్లు ఏపీఓ మృత్యుంజయరావు తెలిపారు. మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం ఎస్సార్పీ ఎం నాగరాజు ఆధ్వర్యంలో శనివారం ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులకు సంబంధించి ఆదివారం నుంచి ఆయ గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు పనులను తనిఖీ చేస్తాయన్నారు.



### ఇసుక ట్రాక్టర్ సీజ్



పెళ్లకూరు: మండలంలోని పుల్లూరు వద్ద స్వర్ణముఖినది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం సెబ్ అధికారులు సీజ్ చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం మేరకు.. స్వర్ణముఖినది నుంచి ట్రాక్టర్లతో వెంకటగిరికి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేశారు. ఈ దాడుల్లో అత్తివరం క్రాస్‌రోడ్డు వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్ సీ శ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేశామని సెబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.